
కథ

# పారిజాత పరిమళం

నంచుల సుశీలాదేవి

బస్సు ఆగకుండానే వెళ్ళిపోయింది
రచన కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి
మళ్ళా ప్రిన్సిపాల్ చేత చీవాట్లు తినాలి.
సిటీ విమెన్స్ కాలేజిలో టైపిస్టుగా పని చేస్తోంది రచన
ఈ రోజు ఏమయిందే తెలియదు.
అన్ని బస్సులూ విపరీతమైన రద్దీగా వున్నాయి.
బస్సు స్టాపుకి దగ్గర్లోనే ''అతను'' నిలబడి వున్నాడు
ప్రతి రోజూ తాను అతనిని గమనిస్తూనే వుంది.
స్కూటర్‌ని ఆనుకొని తననే చూస్తున్నాడు.
రచనకు తాను అందగత్తెను కానని తెలుసును



యువకుల దృష్టిని తాను ఆకట్టుకోలేననీ తెలుసును.

అతను అందంగా వున్నాడు.

ఖరీదైన బట్టలు వేసుకొన్నాడు

అయినా తనను రోజూ గమనిస్తూ వుంటాడు.

రచన కన్నులెత్తి చూసింది.

అతను యీసారి కొంచెం దగ్గరగా వచ్చేడు.

''మీరు రెండు బస్సులు తప్పిపోయారు. మీకు లిఫ్టు కావాలంటే యివ్వగలను''

రచనకు యీ సన్నివేశం కంగారుగా వుంది

ఈ యువకుడి సహాయంతో తాను ఆలస్యం కాకుండా కాలేజికి వెళ్ళవచ్చును.

కాని.. కాని.. మళ్ళీ ఏదో సంకోచం!

అతను అన్నాడు

''నా పేరు రఘురాం. రండి. మిమ్మల్ని మీ ఆఫీసు దగ్గర దింపుతాను''

రచన మరి ఆలోచించలేదు.

కళ్ళద్దాలలో నుండి తీవ్రంగా చూసే ప్రిన్సిపాల్ మేడమ్ చూపులంటే రచనకు వణుకు పుడుతుంది.

ఆ తీక్షణతను తప్పించుకోవాలంటే యితని సహాయం తీసుకోవటం తప్పనిసరి అనిపించింది.

ఇంక సంకోచించకుండా అతని స్కూటర్ ఎక్కింది.

రఘురాం స్కూటర్‌ని రివర్సు చేస్తూ అడిగాడు.

"ఎక్కడకు వెళ్ళాలి"

"బేగంపేట"

రచన మాట పూర్తి కాలేదు

రివ్వున పోనిచ్చేడు.

కాలేజి దగ్గర దిగుతూ అంది రచన

"మీకు చాల రుణపడివున్నాను. ఈరోజు టైముకి రాగలిగేను"

రఘురాం నవ్వేడు.

ఆ రోజంతా రచన మనస్సులో వెన్నెల సోనలు సోనలుగా కురుస్తూనేవుంది.

మళ్ళా మనస్సుని మందలించుకొంది.

కొద్దిగా సహాయం పడినందుకు తాను అతని పట్ల విచలితురాలవుతోంది.

అప్పుడప్పుడు తనతో పనిచేసే మగవారు తనను యింటి దగ్గర దింపుతూనే వుంటారు.



ఇతనూ అంతే.

కాని మనస్సు పాదరసంలా అతని గురించి ఆలోచన వైపే పరుగులు పెడ్తోంది.

ఇంటికి వస్తూంటే గాలిలో తేలిపోతున్నట్లుగా భావన.

మేఘాల పందిరిలో పరుగులెడ్తున్నట్లు ఆలోచన!

చిక్కడపల్లిలో ఓ పాతకాలం నాటి యిల్లు తమది.

పెరటి వాటాలో తమ కాపురం!

అన్నదమ్ముల లావాదేవీలలో పడి ఆయిల్లు చాలా కాలం అట్లాగే వుండిపోయింది.

ఈ మధ్యనే ఎవరో బిల్డర్‌కు అప్పగించేరు.

తొందరలో అపార్టుమెంటులు కడతారని యింటి గలవారు చెప్పారు.

ఇంక యీ యింటికీ తమకూ రుణం తీరిపోతుంది.

పెరటిలో వృక్షంలా పెరిగిన పారిజాతం!

ఆ చెట్టు నీడలో కాసేపు నిలబడి పోయింది.

పెరట్లో కూలిపోవడానికి సిద్ధంగా వున్న పాత పెంకుటి షెడ్డులో తమనివాసం.

ఎప్పుడూ మూలిగే తల్లే!

అనుక్షణం ఎవరినో వకరిని సతాయించే నాయనమ్మ!

ఎప్పటికైనా సినిమా హీరోని కాకపోతానా అని విడుదల అయిన ప్రతీ సినిమాను చూస్తూ టెన్త్ రెండోసారి తప్పిన తమ్ముడూ.

వీళ్ళందరినీ తప్పించుకొని కొంత కాలమయినా సేద తీరడానికి యీ పారిజాతపు నీడ ఒక్కటే తనకు శరణ్యం!

జలజలా రాలే పూలు

ఎర్రటి గొట్టాలతో తెల్లగా బహు సున్నితంగా వుండే పారిజాతాల సన్నని పరిమళం అంటే రచనకు మహా యిష్టం.

మిగిలిన ప్రపంచాన్ని కాసేపు మరచిపోయి తాను ఆహ్లాదకరంగా గడిపే కొన్ని క్షణాలు పారిజాతం నీడలోనే.

సర్వీసులో వుండగానే పోయిన తండ్రి స్థానంలో తనకు యీ వుద్యోగం వచ్చింది.

టైపు చేయటం – తప్పులు దొర్లితే మేడమ్ చేత చివాట్లు తినటం – యింటికి రావడం – అంతే!

నాయనమ్మకి మందులు కావాలి. పళ్ళు కావాలి.

తల్లి నాలుగు రోజులు పనిచేస్తే అయిదు రోజులు పడక వేస్తుంది.

బాధ్యత తెలుసుకోలేని తమ్ముడు!

వీరి మధ్య బొంగరంలా తిరుగుతున్న తన జీవితం!

ఆఫీసు నుండి రావడం కాస్త లేటయితే తల్లికి తాను పెళ్ళికాని పిల్ల నని అప్పటికి గుర్తువచ్చి తనను సతాయిస్తుంది.

తనకు యిష్టమైన స్థలం యీ పారిజాతపు నీడ!

యీ యిల్లును తాము వదిలేయాలి.

పారిజాతాన్ని నరికేస్తారు.

ఈ సన్నటి పరిమళం తనకు మరి లభ్యం కాదు.

తండ్రి వున్న రోజుల నుండీ తాము యీ యింట్లోనే వున్నారు.

ఈ రోజు యీ పారిజాతాలు మరింత పరిమళభరితంగా వున్నాయి.

తల్లి పిలుపుతో వాస్తవానికి దిగి వచ్చి యింటి లోపలకు దారితీసింది.

మరునాడు రచన కళ్ళు రఘురాం కోసం వెతికాయి.

స్కూటర్ మీద వస్తూ పలకరింపుగా నవ్వేడు రఘురాం.

ఇంతలో బస్సు ఖాళీగా వచ్చింది.

రఘురాం వైపు చూసి నవ్వి బస్సు ఎక్కింది రచన.

ఎందుకో ఆమె మనస్సు అసంతృప్తితో రగిలి పోయింది.

నాలుగు రోజుల తరువాత బస్సులన్నీ రద్దీగా వున్నాయి.

ఏ బస్సునీ అందుకోలేక వెనుకకు వచ్చేసింది రచన.

రఘురాం ఆక్షణంలో స్కూటరు మీద ప్రత్యక్షమయ్యాడు.

అతను కాలేజి దగ్గర దింపుతానని అనగానే సంకోచించకుండా

అతని వెంట బయలుదేరింది.

రఘురాం అమీర్‌పేటలో బాంకులో పనిచేస్తాడు.

రచనను కాలేజి వద్ద దింపి అన్నాడు.

"నేను మిమ్మల్ని చూస్తే మీకు లిఫ్టుయిస్తాను. నాదారి కూడా యిటే. బస్సులు దొరికితే సరేసరి. లేకపోతే మీరు మొహమాట పడకుండా నా వెంట రావచ్చును"

రచన నవ్వి "థాంక్స్" అంది.

తరువాత తరువాత రచన బస్సు కాళీగా వచ్చినా రఘురాం వచ్చే టైముకి వుండాలని ఆ బస్సు ఎక్కేది కాదు.

క్రమంగా రఘురాంతో కలిసి కాఫీ తాగడం చనువుగా కబుర్లు చెప్పడం చేసేది.

రఘుతో పరిచయం రచనలో అంతులేని ఆత్మవిశ్వాసాన్ని పెంచింది.

తాను యింత కంటె మంచి వుద్యోగం తెచ్చుకోవాలి అనుకునేది.

డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు కట్టసాగింది.

అప్పుడప్పుడు ఆఫీసులో అమ్మాయిలు వేళాకోళం చేసేవారు.

"రచనా! ఎన్నాళ్ళు యీ ముసుగులో దాక్కోనడం? మనస్సులు విప్పి చెప్పుకోండి. ఒక వేళ అతను బిడియ పడితే నువ్వు ముందడుగు వేయి. తప్పు లేదు"

నాలుగు నెలలుగా రఘురాంతో పరిచయం!

తనని అతను కాలేజి దగ్గర దింపడం

తనని పరీక్షలకు కట్టమని ప్రోత్సహించడం

టైము వుంటే వో టీ కాని, కాఫీ కాని తాగడం

రచనకు అసంతృప్తిగా వుంది.

స్నేహితుల మాటలు గుర్తుకు వస్తున్నాయి.

రఘురాం మనస్సులో మాట చెప్పడానికి మొహమాటపడవచ్చును.

తన మనస్సు అతని ముందు పరిస్తే?

దానిలో తప్పేముంది?

అతను తన వాడు.

ఆ నమ్మకం తనకి వుంది.

ఆ రోజు యింట్లో అందరూ నిద్రపోయాక ఓ కాగితం మీద తన భావాలు పెట్టింది.

"రఘురాం!

మీరు యీ వుత్తరాన్ని ఏవిధంగా భావిస్తారో తెలియదు.

మన మధ్య స్నేహం వుంది.

అది మరో రూపు తీసుకుని నాలో అలజడిని రేపుతోంది.

మిమ్మల్ని చూడని రోజు నాకు అసంపూర్తిగా వుంటుంది.

మీకు నాపట్ల వున్న భావం ఏమిటి?

నిస్సంకోచంగా మీ ఆలోచనను విప్పి చెప్పండి

-రచన"

మరోసారి మరోసారి చదువుకుంది.

ఎక్కడా అధికంగా మాటలు వాడలేదు.

ఎప్పటికైనా ఎవరో ఒకరు బయట పడక తప్పదు.

మరునాడు యధావిధిగా రచనను కాలేజి దగ్గర దింపేడు రఘురాం.

సాధారణంగా రచన నవ్వుతూ "థాంక్స్" అంటుంది.

ఆ రోజు రచన తన పర్సులో నుండి లెటరు తీసి రఘురాంకి యిచ్చి "తీరికగా చదవండి" అంటూ వెనుదిరిగి చూడకుండా కాలేజీలోనికి వెళ్ళిపోయింది.

మరునాడు రచన బస్టాండులో రఘురాం కోసం నిరీక్షించింది.

రఘురాం స్కూటరు తీసుకుని వచ్చి రచన ముందు ఆపి అన్నాడు

"ఎక్కండి"

కాలేజి దగ్గర రచన దిగగానే "ఉండండి" అంటూ వో కవరు రచనకు అందించేడు.

"జాగ్రత్తగా చదవండి" అంటూ వెళ్ళిపోయాడు.

రచనకి ఆరోజు వూపిరి సలపని పని!

కాలేజిలో ఆడిటింగు జరుగుతోంది.

పర్సులో నుండి వుత్తరం తీసి చదివే అవకాశం రాలేదు.

ఎప్పుడో కొన్ని యుగాలు గడిచేక కాలేజిని వదిలింది.

బస్సులో నానా అవస్థలూ పడుతూ యిల్లు చేరింది.

ఆ వుత్తరం నిదానంగా పారిజాతపు పరిమళాల మధ్య చదువుకోవాలని అనుకొంది.

మొహం కడుక్కొని, బట్టలు మార్చుకొని పుస్తకాలు తీసుకొని పారిజాతపు నీడలో కూర్చొంది.

తాను పరీక్షలకు చదువుతున్నానని యింట్లో తెలుసును. తనకు యింక ఎవరూ అంతరాయం కలిగించరు.

పెదవి మీద చిరునవ్వు మెరుస్తుండగా వుత్తరం తెరచింది.

"రచనా!

నా యీ వుత్తరం మిమ్మల్ని నొప్పిస్తే క్షమించండి. ఓ యువకుడు ఏ యువతినైనా స్నేహం చేసి, ఆమెకు సహాయపడాలని ఆశిస్తే, ఆ అమ్మాయి అతను తనను ప్రేమించి వెంటపడుతున్నాడనే భ్రమలో వుంటుంది అని నా స్నేహితుడు వాసు వాదిస్తాడు.

కాదు స్నేహానికి లింగబేధం వుండదు. ఎవరికైనా మనం సహాయపడవచ్చును. మన పరిచయం అవతలి వ్యక్తిలోని ఆత్మవిశ్వాసానికి ఆలంబన కావాలి. అంత మాత్రాన అవతలివారి పట్ల ఆకర్షణ అని భ్రమపడటం అంటూ వుండదని నా వాదన.

మీకు స్నేహ హస్తం అందించడంలో నేను సంకోచించలేదు మీకు ఓ మంచి స్నేహితుడిగా వుండి మీరు ఆత్మ విశ్వాసాన్ని మరింతగా పెంపొందించుకొని వుద్యోగంలో మరింత మంచి స్థానాన్ని పొందగలరని అనుకున్నాను. అంతకు మించి మరో భావం నాకు లేదు.

నన్ను క్షమించండి

నా స్నేహితుడు వాసు వాదనను నిజమని నిరూపించేరు మీరు. ఇంక మనం కల్సుకోవటం మంచిది కాదు.

-రఘురాం"

ఓ చల్లటి పిల్ల తెమ్మెర బలంగా వీచింది.

పారిజాతం చెట్టు జల జలా పూలు రాల్చింది.

ఆ పూలను రెండు చేతులతోనూ తీసుకొని వాసన చూసింది

అతి సున్నితంగా వుండే యీ పూల వునికి చాలా అశాశ్వతం!

కన్నులలో తిరిగబోయే నీటిని కంటిలోనే అదిమిపెట్టి ఆ పూలను నెమ్మదిగా జారవిడచింది రచన.

★

**చిరునామా:**

**నందుల సుశీలాదేవి**

**జి-1, సుభ రెసిడెన్సీ,**

**వేలమూరివారి స్ట్రీట్, రామారావు పేట,**

**కాకినాడ - 533004.**

**ఫోన్: 98482 41701**



## బికినీలో జెనీలియా!

అనుష్క, నయనతార, ప్రియమణి, నమితా వీళ్లందరూ బికినీలో దర్శనమిచ్చి అభిమానులకు కనువిందు చేయడమే కాకుండా సంచలనాలకు కేంద్ర బిందువు అయ్యారు. ఇప్పుడు జెనీలియా వంతు వచ్చినట్లుంది. ఒకప్పుడు క్లబ్ డ్యాన్సర్లు, సెకండ్ హీరోయిన్లు మాత్రమే వేసుకునే బికినీ టైపు దుస్తులను ఇటీవలి కాలంలో స్టార్ ఇమేజ్ ఉన్న తారలు కూడా వేసుకోవడం మొదలు పెట్టారు. అదేమంటే పాత్ర పరంగా ధరిస్తే తప్పేమిటి? అంటూ తప్పించుకుంటున్నారు. సరిగ్గా ఇదే అభిప్రాయాన్ని జెనీలియా కూడా వ్యక్తం చేస్తోంది. ఇప్పటి వరకూ తనకు బికినీ ధరించే పాత్రలు రాలేదని అంటోంది ఈ బబ్లీ గర్ల్. కథాపరంగా పాత్రకు అవసరమైతే బికినీ ధరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదంటూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది జెనీలియా. ఇక నిర్మాతలదే ఆలస్యం అంటున్నారు సినీ వర్గాలు.